క్లుప్తంగా

కాంగ్రెస్‌లోకి సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

పెద్దవూర : సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, పాల్తీతండా సర్పంచ్ పాల్తీ చంద్యా నాయక్ శుక్రవారం సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన చంద్యానాయక్‌కు ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, తిరుమలగిరి సాగర్ ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్, లాల్‌సింగ్, రంగారెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ గడ్డపై కాషాయ జెండా ఎగురవేయాలి



బీజేపీలో చేరుతున్న యువకులకు కాషాయ కండువా కప్పుతున్న వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ గడ్డపై కాషాయ జెండా ఎగుర వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిప్పర్తి మండలం ఇండ్లూరు, నల్లగొండ పట్టణ పరిధిలోని మర్రిగూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్‌కు పలువురు యువకులు బీజేపీలో చేరగా వారికి కాషాయ జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన బీజేపీ ఎంపీ అభ్యర్థిగా శానంపూడి సైదిరెడ్డి నామినేషన్ దాఖలు చేస్తారని తెలిపారు. పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తామని, పార్టీ శ్రేణులు భారీగా తరలి రావాలని కోరారు. నామినేషన్ కార్యక్రమానికి కేంద్రమంత్రి పియూష్ గోయల్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, దాయం భూపాల్‌రెడ్డి, బీపంగి జగ్జీవన్, పెరిక మునికుమార్, గడ్డం మహేష్, గుండా వినయ్, పల్లె ప్రకాష్ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శుక్రవారం అర్చకులు వేదమంత్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభందనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగల్యధారణ, తలంబ్రాల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి క్రిష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కవి సమ్మేళనానికి సుధీర్‌బాబు ఎంపిక

గుర్రంపోడు : మండలంలోని పోచంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మద్దోజు సుధీర్‌బాబు రాష్ట్రస్థాయి కవిసమ్మేళనానికి ఎంపికయ్యారు. తెలంగాణ కవుల సంఘం, కళాకల్చరర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించే కవి సమ్మేళంలో తన రచన ధర్మగంట కవిత ఎంపికైందని, కవితను చదివి వినిపించడానికి తనకు నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందినట్లు సుదీర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ప్రముఖ సాహితీ వేత్తలు సుధామ, విహారి, ఇనాక్,మనోహర్ బాబు తదితరులు పాల్గొనన్నుట్లు తెలిపారు.

చోటున్నా.. రోడ్డు పక్కనే చెత్త

- ప్రతీ వార్డులో చెత్త వేసేందుకు స్థలాల గుర్తింపు
- ఇష్టానుసారంగా పారబోస్తున్న ప్రజలు
- జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



రోడ్డుపై పడవేసిన చెత్త



డ్రైయినేజీలో ..

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో ఎక్కడపడితే అక్కడ చెత్త పారబోస్తున్నారు. రోడ్ల వెంట, ప్రధాన కూడళ్లు చెత్తతో నిండిపోయాయి. ఇప్పటికే మున్సిపల్ అధికారులు ప్రతీ వార్డులో ఐదారు చెత్త వేసే ప్రాంతాలను గుర్తించారు. ఆ ప్రాంతంలోనే చెత్త వేసేలా బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. గతం లో చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి కొంత వరకు మార్పులు తీసుకొచ్చారు. కానీ ప్రజలు మరల రోడ్ల వెంట ఎక్కడపడితే అక్కడే చెత్త పారబోస్తున్నారు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో వీధుల్లో పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి.

చెత్త సేకరణ వాహనం ఆలస్యం అయితే..

మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి తిరిగి చెత్తను సేకరిస్తున్నారు. మున్సిపాలిటీ సిబ్బంది చెత్త వాహనాలను తీసుకువస్తే కాలనీవాసులందరూ చెత్తను తీసుకవచ్చి వాహనంలో పడవేస్తున్నారు. కొన్ని సార్లు సిబ్బంది కాలనీలకు వచ్చినప్పుడు ఇంట్లో వారు కొంత ఆలస్యంగా స్పందించడం, మరికొన్ని సార్లు మున్సిపల్ సిబ్బందే ఆలస్యం కావడంతో తదితర కారణాలతో కాలనీల్లో రోడ్ల పక్కనే చెత్త పడవేస్తున్నారు. ఈ సమస్యను గుర్తించిన అధికారులు మున్సిపాలిటీలోని 48 వార్డుల్లో సుమారు 100 నుంచి 150 వరకు చెత్త వేసే స్థలాల గుర్తించి సూచికలను ఏర్పాటు చేశారు. కానీ మున్సిపల్ అధికారుల ఆదేశాలను మాత్రం బేఖాతర్ చేస్తున్నారు.

బోర్డులకే పరిమితం

చెత్త రహిత ప్రాంతాలుగా గుర్తించిన చోట హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఇక్కడ చెత్త వేస్తే వెయ్యి రూపాయలను జరిమానా విధిస్తామంటూ బోర్డుపై స్పష్టంగా రాశారు. కానీ అవి కేవలంలో బోర్డులకు మాత్రమే పరిమితమయ్యాయి. అదే విధంగా ఇటీవల రోడ్ల విస్తరణలో భాగంగా నాగార్జునసాగర్ రోడ్డులో ప్రధాన డ్రైయినేజీని తవ్వి నిర్మాణం చేపడుతుండగా ఈ నిర్మాణంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో రోడ్ల వెంట ఉన్న వ్యాపారులు వ్యర్థాలను పడవేస్తున్నారు. ఎన్ని బోర్డులు పెట్టినా.. ఎంత అవగాహన కల్పించినా ప్రజలు మళ్లీ మొదటికే వస్తున్నారు.

ప్రజలు సహకరించాలి



చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవు. షాపుల నిర్వాహకులు తమ షాపుల ముందు చెత్త పడేసేతవారికి జరిమానా తప్పదు. చెత్త సేకరణ వాహనాల్లో చెత్త వేయాలి. కాలనీల్లో ఏర్పాటు చేసిన చెత్త సూచికల స్థలాల్లో మాత్రమే చెత్తవేయాలి

– వెంకటరమణ, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఎన్నికల తరువాత బీఆర్ఎస్ కనుమరుగు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

మిర్యాలగూడ : పార్లమెంట్ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు అవుతుందని డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. త్రిపురారం మండలానికి చెందిన బహునూతల నరేందర్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అనుకూలంగా ఉన్నాయని, దాని ఫలితంగా బీఆర్ఎస్ పార్టీ నుంచి భారీగా కాంగ్రెస్‌లోకి వలసలు వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనపై ప్రజలందరూ చాలా సంతృప్తిగా ఉన్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సైదులు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య, పెద్దదేవులపల్లి ఎంపీటీసీ అంబటి రాము, పసుల శ్రీకాంత్, సింగం ముత్తయ్య, గాలి మల్లేష్, రామయ్య, బుడిగె సోమన్న, కొల్లి రవి, చాంద్ పాషా, సురేష్, దైద సురేష్, దైద రవి, వెంకటేశ్వర్లు, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం అర్చకులు చైత్ర శుద్ధ ఏకాదశి, తొలక్కం పూజలతో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎంపి లక్ష్మణరావు, ఉత్సవ కమిటీ సభ్యులు భిక్షం, నర్సింహారావు, గురవయ్య, వీరబాబు, పాల్గొన్నారు.

హాస్టళ్లు, గురుకులాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలపై ప్రత్యేక దృష్టిని సారించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నాణ్యతలేని సరుకులు తీసుకు వచ్చి విద్యార్థులకు వండి పెట్టడంతో ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. అధికారులు నిర్లక్ష్యాలను మానుకొని హాస్టళ్లలను పర్యవేక్షించాలన్నారు.

ఆదాయమే లక్ష్యంగా ముందుకు సాగాలి



మాట్లాడుతున్న డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్

మిర్యాలగూడ టౌన్ : ప్రతీ ఆర్టీసీ ఉద్యోగి ఆదాయమే లక్ష్యంగా ముందుకు సాగాలని డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహించిన 'లక్షే లక్ష్యం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీలో అనేక సంస్కరణల ద్వారా ప్రయాణికులు మెరుగైన సౌకర్యం అందిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ఉద్యోగ కార్మికుల సమష్టి కృషితోనే ఇప్పటి వరకు ఆర్టీసీ అదాయం పెరిగి లాభాల బాటలో నడుస్తున్నట్లు తెలిపారు. అదే ఉత్సాహంతో మరింత ఆదాయం వచ్చేలా కార్మికులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ భారతీబాయి, ఎంఎఫ్ యాదగిరి, అకౌంటెండ్ శ్రీనివాస్, సుపరింటెండెంట్ యాదగిరి, స్టేషన్ మేనేజర్ బిక్షమమ్మ, సెక్యూరిటీ జానకిరెడ్డి, ఆయిల్ సెక్షన్ నందం, జనార్ధన్, సురేష్, ఎక్బాల్, కళ్యాణ్, గోపనబోయిన శ్రీను, పరంగి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

24న షుగరు వ్యాధికి ఉచితంగా మందులు పంపిణీ



మాట్లాడుతున్న పండిట్ శ్రీనివాస్

మిర్యాలగూడ : ఈనెల 24న షుగరు వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు బోధిధర్మ ఆయుర్వేదిక్ వైద్యపీఠం వ్యవస్థాపకులు పండిట్ శ్రీనివాస్‌గురూజీ తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ మధుమేహ వ్యాధితో బాధపడే వారికి ఉచితంగా వైద్యం చేసేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. వీర రాఘవన్ వర్ధంతి రోజున ఉచిత మందు పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మిర్యాలగూడలో బుధ, గురు, శుక్రవారాల్లో మందు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తన వైద్యానికి సహకారం అందించిన జనమైత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మునీర్ చేత ఈ మందు పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. 90రోజులపాటు ఈ మందు వాడినట్లయితే షుగర్ కంట్రోల్ అవుతుందన్నారు. ముఖ్యంగా మద్యపానం అలవాటు ఉన్న వారు ఈ మందును వాడకూడదన్నారు. స్వచ్ఛమైన శిలాజత్, కర్పూర శిలాజత్ అందించబడుతుందన్నారు. ప్రస్తుతం లక్ష డోసులు తయారు చేశామన్నారు. ఈ అవకాశాన్ని మధుమేహ వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది శివలింగం, రాము పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలి



సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాస్

దేవరకొండ : విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలని వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంటర్ ప్రీమియర్ షిప్ డెవలప్మెంట్ అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత దేశంలో వ్యాపార అవకాశాలు పెంపొందించుటకు, విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపార సంస్థలను స్థాపించేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాల న్నారు. విద్యార్థులు లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమావత్ రవి,అధ్యాపకులు రామరాజు, శారదాదేవి, బాల, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటుకొని బత్తాయి చెట్లు దగ్ధం



కాలిపోయిన బత్తాయి చెట్లు

మాడుగులపల్లి : ప్రమాదవశాత్తు నిప్పంటుకొని బత్తాయి చెట్లు దగ్ధమైన ఘటన మండలంలోని కన్నెకల్లు గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెకల్లు గ్రామానికి చెందిన జాలువర్తి నాగేశ్వర్‌రావు బత్తాయి తోట సమీపంలోని కాల్వలో వారం క్రితం ఉపాధి హామీ కూలీలు పనిచేశారు. వీరిలో గుర్తు తెలియని వ్యక్తి కంప చెట్లకు నిప్పంటించడంతో మంటలు సమీపంలోని బత్తాయి తోటకు వ్యాపించి 30 చెట్లు దగ్ధమయ్యాయి. ఈ మేరకు ఉపాధి హామీ ఉన్నతాధికారులకు శుక్రవారం ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు. మాడుగులపల్లి మండల కేంద్రలోనూ ఇటీవల ఉపాధి కూలీల్లో కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించి పొలానికి సమీపంలోని కంపచెట్లకు నిప్పంటించడంతో గడ్డి తగులబడింది. రైతుకు పరిహారం చెల్లించేందుకు కూలీలు ముందురావడంతో ఈ వివాదం సద్దుమణిగినట్లు సమాచారం.

కాంగ్రెస్ మోసాన్ని ప్రజలకు వివరించాలి

నల్లగొండ టూటౌన్: కాంగ్రెస్ మోసాన్ని ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యేలు తిప్పన విజయసింహారెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో నిర్వహించిన కనగల్, నల్లగొండ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. నల్లగొండ నియోజకవర్గంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులే ప్రత్యక్ష సాక్ష్యమని పార్లమెంట్ ఎన్నికల్లో నీలగిరిపై గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపునకు కృషి చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించేందుకు కార్యకర్తలు అందరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దేప వెంకట్ రెడ్డి, కనగల్ మండల అధ్యక్షుడు అయితే గానియాదయ్య, బకరం వెంకన్న, భిక్షం పాల్గొన్నారు.

కనులపండువగా రాములోరి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్‌గౌడ్, తదితరులు



కోలాటం వేస్తున్న చిన్నారులు, యువతులు

రామగిరి (నల్లగొండ): శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రామగిరిలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో రమణీయంగా సీతారాముల రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అలంకరించిన రథంపై సీతారామచంద్రస్వాముల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తుల రామనామాలతో ఊరేగింపు కొనసాగింది. వికాస తరంగిణి సభ్యుల విష్ణు సహస్ర నామ పారాయణ, డప్పు కళాకారుల విన్యాసాలు, చిన్నారుల కోలాటాలు, మేళ తాళాలతో స్వామి వారి రథాన్ని భక్తులు ఇరువైపులా దర్శించుకుంటూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పట్టన అధ్యక్షుడు గుమ్మలమోహన్‌రెడ్డి, కౌన్సిలర్ బుర్రి చైతన్య, ఈఓ జయ రామయ్య, తేలుకుంట్ల శ్రీనివాసులు, పారేపల్లి శ్రీనివాస్, వంగాల అనిల్‌రెడ్డి, నాల్ల వెంకన్న, ప్రభాకర్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



హాలియా : అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారి జానయ్య



దేరవకొండ : సినిమా థియేటర్‌లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

దేవరకొండ : అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తత అవసరమని దేవరకొండ అగ్నిమాపక శాఖ అధికారి రాజునాయక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం దేవరకొండ పట్టణంలోని సినిమా థియేటర్లలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రద్దీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ఫైర్ సేఫ్టీ పరికరాలను ఉపయోగించి మంటలను అదుపు చేసేందుకు యత్నించాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 101కి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

హాలియా : సినిమా థియేటర్, షాపింగ్ మాల్స్ వంటి ప్రదేశాల్లో జరిగే అగ్ని ప్రమాదాలపై యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి జానయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం హాలియా పట్టణంలోని అచ్చిరెడ్డి థియేటర్‌లో యాజమాన్యం, సినిమా హాల్‌లో పనిచేసే సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే తక్షణమే స్పందిచాల్సిన తీరుతెన్నులు, ప్రమాదంలో చిక్కుకున్నవారిని రక్షించడం, గాయపడిన వారికి అందించాల్సిన ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అగ్నిమాపక అధికారి జానయ్య మాట్లాడుతూ ప్రధానంగా షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్స్, జన సమూహం ఉండే ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సినిమా థియేటర్స్‌లో ఎక్కువగా ఎలక్ట్రికల్ రూమ్స్, ఏసీ రూమ్స్‌లో అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని యాజమాన్యానికి సూచించారు. ఎండాకాలంలో ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఎక్కడైన అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే 101కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ శ్రీనివాస్, అగ్నిమాపక సిబ్బంది కోటేశ్వరరావు, శంకర్, నాగుల్ మీరా, ఎస్‌కె హుస్సెన్ పాల్గొన్నారు.

మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు వినతి



మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వీరస్వామికి వినతిపత్రం అందజేస్తున్న యజమానులు

మిర్యాలగూడ టౌన్ : స్కూల్ బస్సులను ఈఐబీ పన్నులను కట్టి పెళ్లి కిరాయిలకు ఉపయోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వీరస్వామికి శుక్రవారం కాంట్రాక్ట్ క్యారేజీ యజమానుల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. స్కూల్ బస్సులను చట్ట వ్యతిరేకంగా పెళ్లిళ్లకు తదితర వాటికి తిప్పుతున్నారని. దీంతో తమకు ఉన్న బస్సులను అన్ని ఆపుకోవాల్సి వస్తుందని, స్కూల్ బస్సుల వారు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందునా వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సయ్యద్ ఆహద్, ఖాజామొయినోద్దిన్, బాలునాయక్, ఎండీ జాఫర్, వెంకట్‌రెడ్డి, షఫీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

26న ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

మాడుగులపల్లి : మండలంలోని కన్నెకల్లు గ్రామంలో ఈ నెల 26న ముత్యాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేయనన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మూల విరాట్‌ను పీఠం పైనుంచి కదిలించనున్నట్లు పేర్కొన్నారు. శంకుస్థాపన కార్యక్రమానికి భక్తులు హాజరుకావాలని వారు కోరారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రజలే బుద్ధి చెబుతారు



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం నాగార్జునసాగర్ నియోజకవర్గానికి వెళ్తూ స్థానిక హనుమాన్‌పేట వద్ద పార్టీ ముఖ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బూత్ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు ఇప్పటి నుంచే సైనికుడిలా పనిచేయాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మాయమాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని, దేశంలో బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. అనంతరం ప్రచార కార్యక్రమాల వివరాలను పార్టీ నాయకులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, నల్లగొండ పార్లమెంటు కన్వీనర్ బండారు ప్రసాద్, పార్లమెంట్ ప్రభారీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, అసెంబ్లీ ప్రభారీ అసెంబ్లీ కో ఆర్డినేటర్ సజ్జల నాగిరెడ్డి, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్యాం, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లంచర్ల అభి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్న మహిళా సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల సంక్షేమానికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలందరూ బీజేపీని గెలిపించేందుకు కృషిచేయాలని కోరారు. మహిళా సమ్మేళానికి మహిళలు పెద్ద తరలిరావాలని కోరారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

- మున్సిపాలిటీలో 358 గజాల్లో నిర్మించిన ఇళ్లు, భవనాల గుర్తింపు
- ఇంకుడు గుంతల ఏర్పాటు చేసుకునేలా అవగాహన



ఇంకుడు గుంతల నిర్మాణాలపై సర్వే చేస్తున్న మున్సిపల్ అధికారులు

దేవరకొండ : భూగర్భ జలాలు అడుగంటుతున్న తరుణంలో మరోసారి ఇంకుడు గుంతల నిర్మాణం తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా మున్సిపాలిటీలో జల సంరక్షణకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వేసవిలో ఎండలు మండుతున్న క్రమంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ఇంకుడు గుంతలు నిర్మించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇప్పటికే దేవరకొండ మున్సిపాల్టీ పరిధిలోని ఆయా వార్డుల్లో వ్యక్తిగత, కమర్షియల్,అపార్ట్‌మెంట్ల వారిగా సర్వే చేపట్టారు. ఆయా వార్డుల్లో వార్డు ఆఫీసర్లు బృందాలుగా ఏర్పాటై గత 10 రోజులుగా సర్వే నిర్వహిస్తున్నారు

మున్సిపాల్టీలో ఇలా..

దేవరకొండ మున్సిపాల్టీ పరిధిలో మొత్తం 20వార్డులున్నాయి.వార్డుల వారిగా గతంలో నియమించిన వార్డు ఆఫీసర్లతో పాటు టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తున్నారు. మున్సిపాల్టీ పరిధిలో 358గజాలు, ఆపై స్థలంలో నిర్మించిన ఇళ్లు, భవనాల్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది యజమానులకు సూచిస్తున్నారు. అంతేగాకుండా వారికి నోటీసులు జారీ చేసి ఇంకుడు గుంతల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 74 నిర్మాణాలు 358గజాలు దాటిన నిర్మాణాలు గుర్తించగా ఇంకుడు గుంతలు లేని కారణంగా వారికి నోటీసులు అందజేసినట్లు తెలుస్తుంది. ఇంకుడు గుంతలు ఉన్న ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వాప్యార సంస్థలు, ఆస్పత్రులు, విద్యాసంస్థలను జియో ట్యాగింగ్ చేస్తున్నారు.సర్వే సిబ్బంది జియో యాప్‌లో నమోదు చేయడం వల్ల ఇంకుడు గుంతలు ఉన్న ఇళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం కానున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం



మున్సిపాలిటీ పరిధిలో ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంకుడు గుంతల నిర్మాణాలపై సర్వే చేపట్టాం. ప్రభుత్వ నిబంధనల మేరకు 350గజాలు,ఆపై స్థలంలో నిర్మించిన భవనాలను గుర్తించి ఇంకుడు గుంతల ప్రాధాన్యత వివరిస్తున్నాం. వర్షపు నీటితో పాటు ప్రతిరోజూ వినియోగించుకునే నీటిని పొదుపు చేసుకునేందుకు ఇంకుడు గుంతలు దోహదపడుతాయి.

- ఎస్.భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, దేవరకొండ